ప్రజాశక్తి

బుధవారం 10 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పట్టాలిచ్చారు సరే స్థలమేది..!

- గోడు తప్ప పేదలకు గూడు లేదు
- చోడపల్లి లే అవుట్‌లో జగన్నాటకం
- స్థలమివ్వకుండానే ఇళ్లు మంజూరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అచ్యుతాపురం విలేకరి

అద్దె ఇళ్లల్లోనూ, ఇరుకిరుకు గదుల్లోనూ తలదాచుకొని, కూలి పనులు చేసుకొని బతుకుతున్న నిరుపేదలకు సొంతింటి కల కలగానే మిగిలింది. ఇంటి పట్టా, ఇళ్లు మంజూరవడంతో అప్పోసప్పో చేసుకొని గూడు కట్టుకుంటామనుకున్న వారికి చివరకు గోడే మిగిలింది. గత ప్రభుత్వం అచ్యుతాపురం మండలం, చోడపల్లి కొండపై వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ లే అవుట్‌లో మోసయ్యపేట, రామన్నపాలెం, చోడపల్లి పేదలు 230 మందికి ఇచ్చిన ఇంటి పట్టాల్లో దాదాపు 90 మందికి స్థలం కేటాయించలేదు. సెంటున్నర చొప్పున స్థలం మంజూరు చేసినట్లు పట్టాలో పేర్కొన్నారు. వీరిలో కొంతమందికి గృహ నిర్మాణ సంస్థ మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పత్రం ఉమ్మడి విశాఖపట్నం కలెక్టర్ వినయ్‌చంద్ పేరున అందజేశారు. వాస్తవానికి ఇంటి పట్టా పొందిన 90 మందికి స్థలమే కేటాయించలేదు. స్థలం కోసం అడిగినప్పుడల్లా కేటాయిస్తామని సమాధానం చెప్పి దాటవేత వైఖరే అవలంబించారని పట్టాదారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. చోడపల్లి కొండపై వేసిన లేఅవుట్‌లోని రీ సర్వే నెంబరు 134/పిలో దమ్ము వెంకటలక్ష్మికి (పట్టా నెంబరు విఎస్‌పి 00195759, ప్లాట్-52), శేషాల మాధురికి (పట్టా నెంబరు - విఎస్‌పి 00157030, ప్లాట్-46), పితాని నీలిమకు (పట్టా నెంబరు-విఎస్‌పి 00196669, ప్లాట్-101), వడిసెల నాగమణికి (పట్టా నెంబరు- విఎస్‌పి 01710999, ప్లాట్-89, 63), వడిసెల జగదీశ్వరికి (పట్టా నెంబరు-విఎస్‌పి 01710965, ప్లాట్-141), పితాని నాగమణికి (పట్టా నెంబరు-విఎస్‌పి 00196468, ప్లాట్-79) మంజూరు చేశారు. వీరితో పాటు మోసయ్యపేట, రామన్నపాలెం, చోడపల్లికి చెందిన పలువురు పేదలకు 2020 డిసెంబరు 26న ఇళ్ల పట్టాలు అందజేశారు. కానీ స్థలం అప్పగించలేదు. వడిసెల నాగమణికి ప్లాట్ నెంబరు తొలుత 89లో స్థలం కేటాయించినట్లు పట్టాలో చూపించి, తరువాత అదికాదని ప్లాట్ నెంబరు 63లో ఇస్తున్నట్లు పేర్కొని, చివరకు ఇంతవరకు ఇంటి స్థలం అప్పగించలేదు. పట్టాలు పొందిన పేదల్లో అత్యధిక మంది ఏళ్ల తరబడి సొంత స్థలంలేక, ఇళ్లులేక అద్దె ఇళ్లల్లో కాలం నెట్టుకొస్తున్నారు. కొంతమంది పేదలకు కేటాయించిన స్థలంలో రాళ్లు పడ్డంతో మిగతా 2లో..



పట్టా చూపుతున్న వెంకటలక్ష్మి

మూడేళ్లయినా స్థలమివ్వలేదు

ఇంటి పట్టా మూడేళ్ల క్రితం ఇచ్చారు. మాకు చూపించిన స్థలం వేరొకరికి ఇచ్చారు. స్థలమడిగితే సమయం పడుతుందని చెప్పారు. ఇప్పటికీ స్థలం అప్పగించలేదు.

దమ్ము వెంకటలక్ష్మి, చోడపల్లి, అచ్యుతాపురం మండలం

నేడు కార్మికుల డిమాండ్స్ డే

పలుచోట్ల ప్రదర్శనలు, మానవహారాలు, సభలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విశాఖ కలెక్టరేట్

దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం చేపట్టనున్న డిమాండ్స్ డేకు కార్మికులు సమాయత్తమయ్యారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, స్కీం వర్కర్లు ఈ డిమాండ్స్ డే విజయవంతానికి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఇప్పటికే విస్తృత ప్రచారం చేపట్టారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు ఆది నుంచీ డిమాండ్ చేస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాయాలని ప్రయత్నిస్తోంది. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో పరుగులు తీసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముకుతాడు వేసేందుకు సిఐటియు పిలుపులో వివిధ రకాల కార్మికులు భాగస్వాములుకానున్నారు. ఈ క్రమంలోనే బుధవారం జిల్లా కేంద్రం అనకాపల్లిలో భారీ ప్రదర్శన జరగనుంది. మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, మానవహారాలు జరగనున్నాయి. జులై ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మూడు చట్టాలు ఆటో, మోటార్ కార్మికుల జీవితాలకు పెద్ద విఘాతంగా మారనున్నాయి. చిన్నచిన్న పొరపాట్లకు భారీ శిక్షలు పడనున్నాయి. ఏనాడూలేని కేసులు, శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వుండడంతో ఆటో, మోటారు కార్మికులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నేడు జరగనున్న డిమాండ్స్ డేలో అనకాపల్లి జిల్లాలోని వివిధ తరగతుల కార్మికులు, స్కీం మిగతా 2లో..

జివిఎంసి కమిషనర్ బదిలీ

- జిల్లా కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) కమిషనర్‌గా పనిచేస్తున్న 2015 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన సిఎం.సాయికాంత్ వర్మను ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిషనర్‌ను నియమించే వరకూ విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్‌కు జివిఎంసి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా ఇటీవలే కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే.

నేడు విశాఖకు ఉక్కు మంత్రి కుమారస్వామి

వార్త మెయిన్‌లో..

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వార్త మెయిన్‌లో...

వాసుపల్లి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవట్లేదు

- కేంద్ర సహకారంతో సమస్యను పరిష్కరిస్తాం
- ఎపిలో దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని నిలబెడతాం
- రైల్వే జోన్‌కు స్థలాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తాం
- విశాఖ ఎంపీ శ్రీభరత్ వెల్లడి



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి సామర్థ్యంతో నడవడం లేదు. అప్పుల్లో కూరుకుపోయింది. సుమారు రూ.20 వేల కోట్ల మేర అప్పులున్నాయి, రోజు వారీగా నడపాలన్నా డబ్బుల్లేవు. ప్లాంట్ విస్తరణ సమయంలో జరిగిన ఖర్చు ఇబ్బంది వైపు నడిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపైనే దీని భవిష్యత్ ఆధారపడి ఉంది. కేంద్ర సహకారంతో స్టీల్‌ప్లాంట్ సమస్యను టిడిపి కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుంది. సెయిల్‌లో విలీనం చేయాలన్న అంశాన్ని పరిశీలిస్తున్నాం' - అని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ వెల్లడించారు. విశాఖ టిడిపి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్‌లతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాష్ట్రంలో తమ ప్రభుత్వం అనుసరించే విధానంపై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై తాను లిఖిత పూర్వక హామీ గతంలో ఇచ్చానని, అందుకనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేసి ప్లాంట్‌ను మిగతా 2లో..

ఉక్కుపై మోడీ ప్రభుత్వ కుట్రలు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కును, ఉద్యోగులను, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టి కర్మాగారాన్ని ప్రైవేటుకు అమ్మాలన్న కుట్రలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలంటే ఉద్యోగులు, కార్మికులు తమ జీతాలు, అలవెన్సులలో త్యాగాలు చేయాలని సంస్థ మానవ వనరుల శాఖ పేరున యాజమాన్యం మంగళవారం ఒక సర్క్యులర్ విడుదల చేసిందని, ఇది అత్యంత బాధ్యతారాహిత్యమైనదని పేర్కొన్నారు. సంస్థ ఉత్పత్తికి, ఉత్పత్తి చేస్తున్న కార్మిక కుటుంబాల జీవితాలకు విఘాతం కలిగించే సిగ్గుచేటు చర్య ఇదని, తక్షణమే ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ కుట్రలో భాగమే ఈ సర్క్యులర్ అని తెలిపారు. కేంద్రం నియమించిన సిఎండి పిఎంఒ అనుమతి లేకుండా ఈ సర్క్యులర్‌ను జారీ చేయగలరా ? అని ప్రశ్నించారు. దీని వెనుక మోడీ ప్రభుత్వ కుట్ర దాగి మిగతా 2లో..

11న ఉమ్మడి విశాఖలో సిఎం బిజీబిజీ

- పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పరిశీలన
- ఎపి మెడిటెక్ జోన్‌లో సిఐఐ సమావేశానికి హాజరు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



మెడిటెక్ పార్కులో ఏర్పాట్ల వివరాలు వెల్లడిస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బిజీబిజీగా గడపనున్నారు. ఈ మేరకు ఆయన టూర్ షెడ్యూల్ ఖరారైంది. చంద్రబాబు తన పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లాలోని దార్లపూడి చేరుకుంటారు. అక్కడి నుంచి 11.15 గంటలకు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌కు బయలుదేరి వెళతారు. అనంతరం 11.20 నుంచి 11.50 వరకు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను పరిశీలిస్తారు. మరలా 11.55 గంటలకు బయలుదేరి దార్లపూడి చేరుకొని అక్కడి నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో 12.05కి బయలుదేరి 12.35 గంటలకు విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని 1.30 వరకూ ఆ ప్రాంతాన్ని, ఆ పరిసరాలను ఏరియల్ వ్యూ ద్వారా సమీక్షిస్తారు. అనంతరం 1.35కి అక్కడి నుంచి బయలుదేరి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పట్టాలిచ్చారు సరే స్థలమేది..!

ఇళ్లు కట్టుకోలేక వదులుకున్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన తప్పిదాలను సరిచేసి ఇంటి పట్టా పొందిన పేదలకు స్థలం కేటాయించి న్యాయం చేయాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పట్టా నాకిచ్చి వేరొకరికి స్థలమిచ్చారు

ఇంటి పట్టా ఇచ్చి, స్థలంలో ఫొటో తీశారు. ఇళ్లు మంజూరైంది. అద్దె ఇంటి బాధ పోతుందనుకున్నాం. తీరాచూస్తే గతంలో చూపించిన స్థలంలో వేరొకరు ఇల్లు కట్టుకున్నారు. ఇదేమని అడిగితే తరువాత మాకు స్థలమిస్తామన్నారు తప్ప ఇవ్వలేదు.

శేషాల మాధురి, చోడపల్లి



పట్టా తప్ప స్థలం లేదు

కొండపైన స్థలం చూపించి ఫొటో తీశారు. కొండ దిగాక తరువాత స్థలమిస్తామన్నారు. కన్నబాబురాజు సమావేశానికి వస్తే స్థలమిస్తామంటే, మీటింగ్‌లకు వెళ్లాం. ఇళ్లులేక రెండు గదుల ఇంట్లో మూడు కుటుంబాలు (పది మంది) తలదాచుకుంటున్నాం. మాకు సొంతిళ్లు కలగానే మిగిలింది.

పితాని నీలిమ, చోడపల్లి

ఇంటి పట్టాలిచ్చిన పేదలకు స్థలం కేటాయించాలి



గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల కాలనీలో ఇంటి పట్టా పొంది, స్థలం కేటాయించని లబ్ధిదారులకు స్థలం కేటాయించి ఇళ్లు మంజూరుచేయాలి. గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిన పేదలకు, ఈ ప్రభుత్వం న్యాయం చేయాలి. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలి. చోడపల్లి కొండపై పేదలకు కేటాయించిన స్థలంలో రాల్లుపడ్డంతో ఇళ్లు కట్టుకోలేని వారికి ఇంటి నిర్మాణయోగ్యమైన సమీపంలో వేరేచోట స్థలమివ్వాలి.

ఆర్.రాము, సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్

నేడు కార్మికుల డిమాండ్స్ డే

వర్కర్లు దాదాపు 30 వేల మంది పాల్గొననున్నారు. కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పనపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంలేదు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్, కంటింజెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలేదు. రెగ్యులర్ చేస్తామన్న మాట నిలబెట్టుకోవడంలేదు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, విఒఎ, మెప్మా, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, ఎస్ఎస్ఎ, 108, 104 కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించకపోవడంతో అభద్రతతో బతుకుతున్నారు. వారంతా బుధవారం నినదించనున్నారు.

కళ్లు తెరిచి కార్మికుల బాధలపై స్పందించాలి

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి సాధారణ ప్రజలు, కార్మికుల బాధలపై స్పందించాలి. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలి. కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలి. పని భారం తగ్గించాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కంచేందుకు చొరవ చూపాలి. కార్మిక వ్యతిరేక వైఖరిని ప్రభుత్వాలు మానుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేస్తాం.

జి.కోటేశ్వరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

విశాఖలో అన్ని జోన్లలో డిమాండ్స్ డే

విశాఖ జిల్లాలో అన్ని జోన్లవారీగా, రీజినల్ వారీగా డిమాండ్స్ డే నిర్వహించడానికి ఆయా ప్రాంతాలలోని సిఐటియు నాయకులు ఈసరికే సన్నాహాలు పూర్తి చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొంటారు.

ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవట్లేదు

కాపాడతామని, అయితే తాము ఒక్కరమే లేమని, కూటమిలో భాగంగా ఉన్నామని, కూటమి కేంద్రంలో ఉందని గుర్తుచేశారు.

రైల్వే జోన్‌పై ఏమన్నారంటే..

రైల్వే జోన్ విశాఖలో ఏర్పాటు కోసం గత ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని తాము స్థలాన్ని అందించే ప్రయత్నం చేస్తామని అన్నారు. వైజాగ్ స్టేషన్ అభివృద్ధికి మోడీ గతంలో వర్చువల్‌గా రూ.600 కోట్లతో పనులు ప్రారంభించారని, వీటికి బిడ్డింగ్ దశ పూర్తయిందని అన్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలనూ దెబ్బతీసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని తాము పూడ్చుతామన్నారు. ఇసుకను దోపిడీ చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను గత ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు. ఐదేళ్లుగా చతికిల బడ్డ అన్ని వ్యవస్థలకు కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో పూర్వ వైభవం రానుందన్నారు. అలాగే రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు మంచి రోజులొచ్చాయన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 40 వేల టన్నుల ఇసుకను అమ్మేసుకుని రూ.వేల కోట్లు దోచుకుందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 రోజులకే మెగా డిఎస్సీ ఇచ్చిందన్నారు. పెంచిన పింఛనుతో పాటు రూ.7 వేలును అందించిందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిఐటియు మల్కాపురం జోన్ కార్యకర్తలు

స్టీల్ మంత్రి ఉక్కుపై ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి బుధవారం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వస్తున్నారని, ఆయన విశాఖ వేదికగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

1195వ రోజుకు దీక్షలు

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం నాటికి 1195వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు, కృష్ణారావు, ఎంబి.కిషోర్, డి.అప్పారావు, పి.సురేష్, సూరప్పడు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం జిల్లా టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇచ్చే పార్టీ టిడిపి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్, భీమిలి నాయకులు కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

రాయలసీమ కింగ్స్ సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూన్ 30 నుంచి విశాఖలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో సోమవారం బెజవాడ టైగర్స్‌పై విజయంతో రాయలసీమ కింగ్స్ లీగ్ దశను ముగించిందని జట్టు కెప్టెన్ గిరిధర్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని వారు బస చేసిన అంబిక సీ గ్రీన్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీం యజమాని దశరథ రామి రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ గిరిధర్ రెడ్డి మాట్లాడారు.

ఉక్కుపై మోడీ ప్రభుత్వ కుట్రలు ఆపాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి..) ఉందన్నది బహిరంగ రహస్యమన్నారు. విశాఖ ఉక్కు కార్మికులకు ఏడు సంవత్సరాల నుంచి నూతన వేతన ఒప్పందం అమలు చేయడం లేదని, ఒక్కొక్కరికీ రూ.20 నుంచి 25 లక్షల వేతన బకాయిలు రావలసి ఉందని తెలిపారు. జీతాల్లో ఇఎంఐలు కట్టగా మిగిలిన జీతంతో కార్మికుల కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందన్నారు. టైంకి జీతాలు చెల్లించడం లేదన్నారు. అయినా సంస్థలో ఎటువంటి ఆటంకం లేకుండా ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఇంకా వీరు ఏం త్యాగం చేయాలి ? సంస్థ ఉద్యోగులు, కార్మికులు వారి జీతాలు, అలవెన్స్‌లు, మరిన్ని త్యాగాలు చేసి వారి కుటుంబాలు మరింత ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతే సంస్థ మనుగడ సాగిస్తుందా ? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును కావాలనే మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. విశాఖ ఉక్కు నుండి పన్నులు, డివిడెంట్ల రూపంలో ఇంతవరకు సుమారు రూ.45 వేల కోట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.5 వేల కోట్లు ఆర్థిక సహాయం ఎందుకు చేయదని, వర్కింగ్ క్యాపిటల్ ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. కార్మికులు, ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి కుట్రలను, కుతంత్రాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపికి ప్రజలు మెజారిటీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీల కీలక మద్దతుతో కేంద్రం నడుస్తోందన్నారు. ఈ సానుకూల పరిస్థితి దృష్ట్యా టిడిపి కూటమి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కాపాడి, అభివృద్ధి బాటలో నడిచే విధంగా అన్ని చర్యలూ తీసుకుంటుందని ఉక్కు కార్మికులు, విశాఖ ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వెంటనే కార్యరంగంలోకి దిగాలని విజ్ఞప్తి చేశారు.

11న ఉమ్మడి విశాఖలో సిఎం బిజీబిజీ

(మొదటి పేజీ తరువాయి..) 2.00 గంటలకు విశాఖపట్నం జిల్లాలోని ఎపి మెడిటెక్ జోన్‌కు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 2.30 నుంచి 4.30 వరకు ఎపి మెడిటెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన సిఐఐ సమావేశంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మరలా 4.35కి అక్కడి నుంచి బయలుదేరి 4.45కి విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 4.50 నుంచి 6 గంటల వరకు ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 6.10 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 7.10 గంటలకు విజయవాడ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి
- హోం మంత్రి అనిత

ఎంవిపి.కాలనీ, అనకాపల్లి, ఎస్.రాయవరం : సిఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖ, అనకాపల్లి జిల్లాల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా చంద్రబాబు విశాఖకు విచ్చేస్తున్నారని, ఆయన పర్యటన ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లూ ఉండరాదని స్పష్టం చేశారు. కొందరు అధికారుల్లో నిర్లిప్తత ధోరణి కనిపిస్తోందని, దాన్ని విడనాడి సొంత కార్యక్రమంలా భావించి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సిఎం సన్నాహక ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం మెడ్‌టెక్ జోన్ సమావేశ మందిరంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకబ్రత భాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మలతో కలిసి జిల్లా అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అనిత ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాయిల్‌ను పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అపోలో ఆసుపత్రి వద్ద మృతుని కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రి వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. చికిత్స కోసం చేరిన బాలుడు మృతి చెందాడు. పెండింగ్ బిల్లు చెల్లించి మృతదేహం తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు దిగారు. కుమారుని పోగొట్టుకున్న బాధలో తాము ఉన్నామని, ఎటువంటి చెల్లింపులు చేయలేమని కుటుంబ సభ్యులు భీష్మించుకొని కూర్చున్నారు. దీంతో ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వచ్చి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు.

ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన నిఖిల్ వెంకటసాయి కొన్ని రోజుల క్రితం జ్వరంతో ఫిట్స్ వచ్చి అపోలో ఆసుపత్రిలో చేరాడు. ప్రారంభంలో దఫదఫాలుగా రూ.3.65 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. దీంతో పాటు బాలునికి ఉన్న ఇన్సూరెన్స్ రూ.7 లక్షలను ఆసుపత్రి యాజమాన్యం క్లెయిమ్ చేసుకుంది. బాలుడు మృతి చెందడంతో మొత్తం బిల్లు రూ.22 లక్షలు అయిందని, మిగతా 12 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. కుమారుని పోగొట్టుకున్న బాధలో ఉన్నామని, వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ఇచ్చినవి, తమ దగ్గర ఉన్నవి అన్నీ ఇప్పటికే పెద్ద మొత్తంలో చెల్లించామని, తమ దగ్గర ఇంకా ఏమీ లేవని వేడుకున్నారు. అయినా ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించకపోవడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. స్థానిక మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందరావు, పోలారావు, గాడి సత్యం, ముగడ రాజారావు, మజ్జి రమణి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన చేపట్టారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం ఏమీచేయలేక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



యూనిఫాం అందుకున్న విద్యార్థులు

యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు యూనిఫామ్‌ను వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రమణ, పిఇటి సతీష్, నాయకులు గంటా నూకరాజు, ఎం.సంజీవ్‌కుమార్, ఎస్.జోగారావు పాల్గొన్నారు. మజ్జిపేట ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంతి

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : పశుగ్రాసం పెంపకంపై భీమిలి మండలం, ఆర్.తాళ్లవలస పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జి.ప్రశాంతి మంగళవారం పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా తాళ్లవలస తదితర గ్రామాల్లో ఆమెతో పాటు సిబ్బంది పర్యటించి పశు గ్రాసం ప్రాముఖ్యతను వివరించారు. పశు గ్రాస విత్తనాలైన జొన్న, మొక్కజొన్న విత్తనాలను 75 శాతం రాయితీపై తమ పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని కోరారు.

కుండపోత వర్షం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 93, 94, 95, 96, 97, వార్డు పరిధిలో ఉన్న నాయుడుతోట, వేపగుంట, పురుషోత్తపురం, చినముసిడివాడ, పెందుర్తి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. సుమారు అరగంట సేపు రవాణా స్తంభించింది. గత రెండు రోజుల నుంచి వరుణుడు ఊరిస్తున్నా మంగళవారం వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

రెండో విజయరామరాజు సంస్మరణ దినోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న రెండో విజయరామరాజు సమాధి వద్ద బుధవారం సంస్మరణ దినోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆటో కార్మికుల స్టాండ్‌ను ప్రారంభిస్తున్న మూర్తి

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బీచ్ రోడ్డులో కొత్తగా శ్రీనూకాంబికా ఆటో డ్రైవర్ల సంఘం (సిఐటియు) ఏర్పాటైంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పల్లా శ్రీను, పి.శ్రీనివాసరావు, అధ్యక్షులు వి.ఎర్రిబాబు, కార్యదర్శి బి.వెంకటఅప్పారావు, ఉపాధ్యక్షులు బి.సురేష్, సహాయ కార్యదర్శి పి.అప్పలరాజు, కోశాధికారి జి.సురేష్, సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. స్వతంత్రనగర్‌లో మంగళవారం ఆయన మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి మేక సత్తిబాబు, ఎసిపి త్రినాద్, సిఐలు పాల్గొన్నారు.

ఆరిలోవ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆరిలోవ సిఐ గోవిందరావు కోరారు. శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాలు- వాటి పర్యవసానం, సైబర్ నేరాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ గోవిందరావు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా వినియోగంలో ఉన్నాయని, వాటికి విద్యార్థులు ఎట్టి పరిస్థితిలోనూ ఆకర్షితులు కాకూడదని చెప్పారు. చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. యువతలో చాలా మంది ఆన్‌లైన్ మోసాలకు బలైపోతున్నారని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి మంగమారిపేట, జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్థానిక ఎస్ఐ చిన్నంనాయుడు ఆధ్వర్యాన మంగళవారం అవగాహన కల్పించారు. గంజాయి, హెరైన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.భాను, ఎస్ఇబి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు పిఎంఎంఎస్‌వై కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ షహనాజ్ సాధియా ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 48 మంది గర్భిణులు వైద్య సేవలు పొందారు. అవసరమైన ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ షహనాజ్ సాధియా మాట్లాడుతూ, గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. రక్తహీనత వున్న గర్భిణులు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రసవాలు అయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిల వద్ద ప్రతి నెలా తనిఖీలు చేయించుకున్న గర్భిణులు ఆరవ నెలనుంచి ప్రసవం అయ్యేవరకు నెలనెలా వైద్యాధికారి వద్ద తనిఖీ నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ శ్రీదేవి, సూపర్‌వైజర్ రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో మలేరియా, డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబేకాలనీలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పిళ్లా వెంకట్రావు ఆధ్వర్యాన మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులపై సంబంధిత సిబ్బంది అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి సిఒ ప్రవీణ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన ఎన్ని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఆనందపురం : ఏపి డిజిపి ద్వారక తిరుమలరావు రావును మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో బిసి కులాలపై జరిగిన దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు పునరావృతం కాకుండా శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధి అల్లిపురం గాంధీ బొమ్మ సమీపంలోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్న బలివాడ నాగేశ్వరరావు (56) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మూడేళ్లగా అదే ఇంటిలో ఆయన అద్దెకి ఉంటూ, పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంది. ఆయనపై భార్య పద్మ 2008లో ఫోర్త్ టౌన్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టింది. వీరికి కుమారుడు మణికంఠ సాయి ఉన్నాడు. భార్య పద్మ కుమారునితో కలిసి మర్రిపాలెంలో వేరేగా ఉంటోంది. చాలా కాలం నుంచి భార్యాభర్తలు విడివిడిగానే ఉంటున్నారు. నాగేశ్వరరావు అనుమానాస్పదంగా మరణించిన ఇంటి పక్కనే అతని బావ గొట్టిపెల్లి అరుణ్ కుమార్ అద్దెకు ఉంటున్నాడు. చెడు వాసన రావడంతో అరుణ్ కుమార్ వెళ్లిచూడగా మంచంపై నాగేశ్వరరావు చనిపోయి కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నూతన గుంటపాలెంలో చోరీ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని నూతన గుంటపాలెం గ్రామంలోని పలు ఇళ్లలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. ఒక ఇంట్లో బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నూతనగుంటపాలెంలో పిల్లి సుందరరావు చెందిన ఇంట్లోకి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులను పగలగొట్టి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులతో విశాఖపట్నం వెళ్లిన సుందరరావు మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇల్లు మొత్తం చిందరవందరగా ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, తులమున్నర బంగారు ఆభరణం, రూ.20వేలు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సిఐ వినోద్ బాబు, ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం ద్వారా వేలుముద్రలు సేకరించారు. అలాగే గ్రామంలోని కోరుకొండ మారయ్య, కలిగట్ల మహాలక్ష్మి నాయుడు, చిక్కాల రమణ, కళ్లం గౌరమ్మ వరలక్ష్మి, చిక్కాల రమణమ్మ, అగ్రహారం శ్రీనివాసరావు తదితరుల ఇళ్లల్లోకి కూడా గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. అయితే వారి ఇళ్లలో ఏమీ చోరీకి గురికాలేదని సంబంధిత బాధితులు తెలిపారు. సిఐ వినోద్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారస్ బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం లాలం కొత్తూరు వద్ద సోమవారం రాత్రి లారస్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జిల్లాలోని కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామానికి చెందిన తండ్రి దొరబాబు, కొడుకు రాజేష్ (27) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళు తున్నారు. కశింకోట మండలం లాలం కొత్తూరు వద్దకు వచ్చేసరికి వెనుక నుండి వస్తున్న లారస్ కంపెనీ బస్సు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాజేష్, దొరబాబు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనాన్ని రప్పించి క్షతగాత్రులను అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించి కెజిహెచ్‌లో రాజేష్ మృతి చెందాడు. ఆయన తండ్రి దొరబాబు పరిస్థితి బాగానే ఉంది. తండ్రి దొరబాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కశింకోట ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు రాజేష్ సాఫ్ట్ వేరు ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

అప్పన్నను దర్శించిన యలమంచిలి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్నను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఆనంద్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ అధికారులు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. వారితోపాటు దేవస్థానం ఈఈ రాంబాబు, కనకరాజు, హరిరాజు, జనసేన నాయకులు మజ్జి సూరిబాబు, మజ్జి శ్రీను తదితరులు స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు.



ప్రభుత్వ స్థలంలో వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రభుత్వ స్థలంలోని ఫెన్సింగ్ తొలగింపు

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 97వ వార్డు ఉడాకాలనీ సమీపంలో సర్వేనెంబర్ 196/3లోని ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా వేసిన ఫెన్సింగ్‌ను రెవెన్యూ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సాయి మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీతంరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంఎన్. హరేంద్రప్రసాద్‌ను టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్ఛార్జి సీతంరాజు సుధాకర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం దక్షిణ నియోజక వర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సీతంరాజు సుధాకర్ మీడియాకు తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీతంరాజు సుధాకర్

కోస్టల్ రైడర్స్ విజయం

ప్రజాశక్తి -పిఎం పాలెం: పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వేదికగా ప్రారంభమైన ఏపిఎల్ లీగ్ మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్, గోదావరి టైటాన్స్ టీమ్‌లు మంగళవారం తలపడ్డాయి. 6 వికెట్ల ఆధిక్యంతో కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన కోస్టల్ రైడర్స్ బౌలింగ్ ఎంచుకొని బరిలోకి దిగింది. బ్యాటింగ్‌కు దిగిన గోదావరి టైటాన్స్ 17.1 ఓవర్లలో 138 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ 141 పరుగులు చేసి విజయం సాధించింది.

52వ వార్డులో జియ్యాని శ్రీధర్ పర్యటన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పర్యటించారు. ది పెంతి కోస్టల్ చర్చి సమీపంలో సాయంత్రం ఫుడ్ కోర్టు వ్యాపారం చేస్తున్న స్థానికులు నీటి సరఫరా వసతులు కావాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. మర్రిపాలెం ఉడా లే-అవుట్‌లో గ్రీన్ బెల్ట్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్ సప్లై ఎఇ ఇమాన్యుల్, ఎఇ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను కించపరిచిన వ్యక్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పైలా దాస్‌పై బ్రాహ్మణ సంఘాల సభ్యులు మంగళవారం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సిపి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. పైలా దాస్‌ను పిలిచి విచారిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, ఇతర సిబ్బంది కలిసి మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. సంగివలస ఎస్ఆర్ కాలనీకి ఆనుకుని ఉన్న కొండప్ప చెరువును పరిశీలించారు. చెరువులోని నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మురుగు నీరు నిల్వ వల్ల దుర్వాసనతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు అవస్థలు పడుతున్నట్లు జోనల్ కమిషనర్‌కు వివరించారు. అండర్ పాత్ వద్ద చిన్న పాటి వర్షానికే రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచిపోతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు బడిగింటి నీలకంఠం, ఇంఛార్జి చోడిపల్లి సాయి జయశంకర్, తెలుగు మహిళా నాయకులు రిక్క సత్య, జనసేన రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకరరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులపై దాడి ఆపి జీతాలు చెల్లించాలి

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికులపై సర్క్యులర్ రూపంలో చేస్తున్న దాడిని తక్షణం ఆపాలి, కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన ప్లాంట్‌లోని సిఎంఎస్ వద్ద మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, స్టీల్ యాజమాన్యం అనాలోచితంగా, అవివేకంతో విడుదల చేసిన సర్క్యులర్లను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు చెల్లించకుండా యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. బ్యాంక్‌లకు చెల్లించాల్సిన ఇఎంఐలు చెల్లించే పరిస్థితి లేకుండా స్టీల్ కార్మికులను అపరాధులుగా చిత్రీకరించాలనే లక్ష్యంతోనే సర్క్యులర్లను విడుదల చేశారని చెప్పారు. యాజమాన్యం ఇటువంటి ఆలోచనలు మానుకొని స్టీల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడి సరుకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని హితవుపలికారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులు విరాళాలు ఇవ్వాలని యాజమాన్యం ఇంకొక సర్క్యులర్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులకు ఇప్పటికే న్యాయంగా సంక్రమించాల్సిన నూతన వేతనాలు అమలు చేయకపోవడంతో నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నష్ట పోతున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థ అని మరిచి ఒక మార్వాడి సంస్థగా భావించి ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్న సిఎండిని తక్షణం రీ కాల్ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్య అనాలోచిత నిర్ణయాలతోనూ, ప్రభుత్వ విధానాలతో నష్టాలలోకి నెట్టబడుతున్న విశాఖ స్టీల్‌ను కాపాడాల్సిన ప్రభుత్వం నేడు కార్మికులలో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తూ, భయాందోళనలకు గురి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యాల వైఖరి ఇదే పద్ధతిన కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, కె.బాలశౌరి, టివికె.రాజు, సూర్యనారాయణ, ముత్యాలనాయుడు, బి.మహేష్, రాజు, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-సీతమ్మధార : గత ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన జిఒ.117ను తక్షణమే రద్దు చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ డిమాండ్‌చేశారు. సీతమ్మధార మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం యుటిఎఫ్ సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి తాటికొండ జగన్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ మాట్లాడుతూ, విలీనం ద్వారా 1,2 తరగతులకే పరిమితమైన పాఠశాలలో 3, 4, 5 తరగతులు ప్రారంభించాలని, 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న హైస్కూళ్లలో సమాంతర మీడియమ్‌నకు అవకాశం కల్పించాలని కోరారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను డిఇఒ చంద్రకళ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి.జనార్ధన్, కె.రాంబాబు, రియాజ్ అహ్మద్, ఎస్.శోభ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఉచిత ఇసుకపై వైసిపి ఆరోపణలు అర్ధరహితం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ఉచిత ఇసుకపై వైసిపి ఆరోపణలు అర్ధరహితమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత ఇసుక విధానం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాత గాజువాక పార్టీ కార్యాలయం వద్ద కూటమి నేతలతో కలిసి భవన కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంచి నిర్ణయాన్ని తీసుకున్నారని, దీనిపై వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తుందన్నారు. ప్రజలకు మేలు కలిగే నిర్ణయాలను హేళన చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఇప్పుడే ఇసుక ఉచిత పాలసీ అమలులోకి వచ్చిందని, దశలవారీగా ప్రజలకు చేరువ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన నేతలు గడసాల అప్పారావు, గంధం వెంకటరావు, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మృతి కారకునికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-బీగల్ : అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మరణానికి కారణమైన నిందితునికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రధాన మహానగర మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. రూ.1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదన వినిపించిన మైలపల్లి ఆదినారాయణ కథనం ప్రకారం... నిందితుడు రాగోలు ప్రశాంత్ 2019 మార్చి 5వ తేదీన సాయంకాలం మూడున్నర గంటల ప్రాంతంలో తన డస్టర్ కారును అజాగ్రత్తగా అతివేగంతో నడిపిస్తూ రోడ్డు పక్కన ఉన్న ఆరిలోవ ప్రాంతానికి చెందిన అపోలో హాస్పిటల్‌లో పనిచేస్తున్న తమ్మిశెట్టి సురేంద్రరెడ్డిని ఢీకొట్టాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుని తమ్ముడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితునిపై నేరం రుజువైనందున పైవిధంగా తీర్పు చెప్పారు.

యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బీమ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పిఎంఎస్‌ఎంఎ ద్వారా నిర్వహిస్తున్న మాతా శిశు ఆరోగ్య సేవలు గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బిసిజి వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణికి ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలకు, వైద్యులకు సూచించారు. సి-సెక్షన్ ప్రసవాలు నివారించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా స్టాప్ డయేరియా ప్రోగ్రాం మీద ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగభూషణం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలతో హత్య : సిఐ

ప్రజాశక్తి-ఉక్కునగరం : మల్కాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన దాడి సూర్యకిరణ్‌పై గంగవరానికి చెందిన కోర్లయ్య కత్తితో దాడి చేసి హతమార్చడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమని ప్రాథమికంగా భావిస్తున్నామని దువ్వాడ సిఐ ఎర్రంనాయుడు తెలిపారు. అగనంపూడి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన హత్యకు సంబంధించి ఘటనా స్థలాన్ని సిఐ మంగళవారం ఉదయం పరిశీలించారు. హత్యకు గల కారణాల గురించి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

24 కాలనీకి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం గ్రామంలోని 24 కాలనీకి రక్షణ కల్పించాలని జనసేన నాయకులు, జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు కుప్ప రామలక్ష్మి అధికారులను కోరారు. కాలనీలో దొంగల భయంతో ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. రెండు రోజులు కిందట కుప్ప రమేష్ ఇంటి ముందు పార్కింగ్ చేసిన పల్సర్ బైక్ చోరీకి గురైందని పేర్కొన్నారు. నాలుగు నెలల కిందట రోడ్డు పక్కన ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి దొంగలు పరారయ్యారని తెలిపారు. నాలుగేళ్ల కిందట రోడ్డు పక్కన ఒక చిన్న దుకాణం పెట్టుకొని జీవిస్తున్న వృద్ధురాలు కుప్ప తవిడమ్మను హత్య చేసి బంగారం పట్టుకుపోయారని వివరించారు. ఈ దొంగతనాలకు ముఖ్య కారణం 24 కాలనీలో ఐదారు బెల్ట్ షాపులు నడవడమేనని వివరించారు. ఆనందపురం పోలీసులు, అధికారులు పరిశీలించి రాత్రి పూట పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వియ్యపు కొండబాబు, ప్రెసిడెంట్ జాజుల గంగరాజు, జనరల్ సెక్రటరీ దువ్వు శ్రీను, కోనేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జంక్షన్ వేములవలసలోని ఎరువుల గొడౌన్లను ఎస్ఆర్ జిల్లా వ్యవసాయ సంచాలకులు కెవి.చౌదరి, విజిలెన్స్ సిఐ రవి ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు, అమ్మకాలకు సంబంధించిన వివరాలు పరిశీలించారు. కొనుగోలుదారులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఆనందపురం వ్యవసాయాధికారి సంధ్య రత్నప్రభ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని గిరిజన గ్రామం ములకాపల్లిలో ఉపాధి హామీ కూలీలకు 9 వారాలుగా బకాయిపడ్డ కూలి డబ్బులు తక్షణమే చెలించాలని సిఐటియు నాయకులు శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ములకాపల్లి గ్రామంలో మంగళవారం వారు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు 9 వారాలుగా కూలి డబ్బులు ఇవ్వలేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూలీలకు న్యాయమైన సమ్మర్ అలెవెన్స్, గునపం, పారలకు రుసుం చెల్లించాలని కోరారు. వారం వారం పే స్లిప్పులు అందివ్వాలని, 15 రోజులకు ఒక సారి పేమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 200 పని పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, పని ప్రదేశంలో నీడ, మంచినీళ్ల, పనిముట్లు సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేకుంటే ఎంపిడిఒ, సచివాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములకలాపల్లి ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు, వ్యకాస నేతలు


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నేత సురేంద్ర

సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇసుక తవ్వకాలకు చైర్మన్‌గా కలెక్టర్ ఉన్న నేపథ్యంలో సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అనకాపల్లి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా విజయ కృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ జిల్లా అధికారులు గత ప్రభుత్వంలో ఇసుకపై వ్యాపార సామ్రాజ్యమే ఏర్పాటు చేసుకొని, ఇతర రాష్ట్రాలకు తరలించి సామాన్య ప్రజలకు ఇసుక అందకుండా చేశారని తెలిపారు. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ కచ్చితంగా విధి విధానాల ప్రకారంగా ఇల్లు కట్టుకునే ప్రతి సామాన్యుడికి ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో వినాయక చవితి పండుగ రానున్న నేపథ్యంలో వేడుకలను పర్యావరణహితంగా చేసే విధంగా మట్టి వినాయకుడినే పూజించేలా అధికారులచే ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని, ఈ ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే అమలు చేశారన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండడమే తెలుగుదేశం పార్టీ విధానమని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాని నడిపించి ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని విమర్శించారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఖర్చు అయితే అందులో ఇసుక కొనడానికి మూడు లక్షల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసినట్లు నాగ జగదీష్ ఆరోపించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బోడి వెంకటరావు, కొట్ని రామకృష్ణ దొర, మళ్ల గణేష్, సాలపు నాయుడు, మల్ల శివన్నారాయణ, పిల్లా తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ నెరవేర్చిన చంద్రబాబు, పవన్

ఎన్నికలలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీను నెల రోజులలోనే నెరవేరుస్తున్న ఘనత నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లకు దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకే ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టారన్నారు. వైసిపి ప్రభుత్వం లాగా కాకుండా సుప్రీం కోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, గొంతిన శ్రీనివాసరావు, బిఎస్ఎంకె జోగినాయుడు, పోలారపు త్రినాథ్, ఎంపీటీసీ నారపిన్ని చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలం కేంద్రంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపవోడవరం ఎడిఎసి సిహెచ్‌కెవి.చౌదరి మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ డీలర్లు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రైతులకు విక్రయించాలని స్పష్టం చేశారు. రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా ప్రభుత్వం యూరియా తదితర ఎరువులను రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల షాపుల లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. హైబ్రిడ్ విత్తనాలు ఎక్కువగా రైతులకు విక్రయించే ముందు వాటి నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఆర్.రవి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, జిల్లా క్వాలిటీ కంట్రోల్ వ్యవసాయ అధికారి ఎన్.సరోజినీ దేవి, ఏఈఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలో అచ్చర్ల గ్రామంలో రైతులకు మంగళవారం గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశు గ్రాసం ద్వారా పాల దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. ప్రతి పాడి రైతు సకాలంలో పశువులకు పోషణ అందించాలన్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు నైనముశెట్టి రమణరావు, కన్నూరుపాలెం పశు వైద్యాధికారి ఎం.డయనా, కార్యదర్శి మహేష్, రైతులు పాల్గొన్నారు.


గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

ఆగని భూ కబ్జాలు

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం


పునాదులు నిర్మించి గ్రావెల్ నింపిన దృశ్యం

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 286లో భూ కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రెవెన్యూ యంత్రాంగం భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నట్లు పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్బవరం సూదికొండ సర్వే నెంబర్ 286లో ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొంతమంది నేతలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై పలువురు స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భూకబ్జాదారులు నిర్మాణాన్ని ఆపకుండా పునాదులు నిర్మించి పునాదుల్లో గ్రావెల్ నింపుతున్నారు. మండల కేంద్రంలో భూముల విలువ విపరీతంగా పెరిగిపోవడంతో భూ కబ్జాదారులు బరితెగించి మరి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలు పునరావృతం కావడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారి యంత్రాంగం ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై వాడుక నీరు ప్రవాహం

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-వద్దాది

బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం వద్ద చోడవరం నుండి నర్సీపట్నం (బిఎన్ రోడ్డు) వెళ్లే ప్రధాన రహదారిపై వర్షా కాలాన్ని తలిపించేలా నిరంతరం నీరు పారుతోంది. ఎండలు మండిపోతన్నా రోడ్డుపై నీరు పారడం ఆగడం లేదు. ఈ రోడ్డులో ఉన్న గోతుల్లో ఆ నీరు నిల్వ ఉండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌బిపి అగ్రహారంలోని వీధి కుళాయి నుండి వచ్చే నీరు పోయేందుకు కాలువలు లేవు. ఈ వీధి కుళాయి దగ్గరే స్థానికులు సామాన్లు తోమడం, బట్టలు ఉతకడం వంటి అన్నీ పనులు చేస్తున్నారు. దీంతో రోజంతా కుళాయి విప్పేసే ఉంటుంది. స్థానికులు వాడే నీరు పోయేందుకు కాలువ లేకపోవడంతో రోడ్డుపైకి వెళ్తుంది. దీనికి తోడు ఆ కుళాయికి సమీపంలోనే ప్రధాన రోడ్డుపై గోతులు ఉన్నారు. వాడుక నీరు ఆ గోతుల్లో చేరి నిల్వ ఉంటుంది. రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్ళినప్పుడు నడిచి వెళ్లే పాదచారులపై ఆ నీరు తుల్లుతుంది. దీంతో పాదచారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అదే రోడ్డుపై ప్రతి రోజూ సచివాలయ సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నా ఆ సమస్య గురించి పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై నీరు నిలిచి ఉంటే గుంతలు మరింత పెద్దవైపోతాయని, దానివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాడిక నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


చోడవరం-నర్సీపట్నం ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వాడుక నీరు

యోగాకు క్రీడల్లో స్థానం కల్పించడంపై హర్షం

ప్రజాశక్తి-చోడవరం

ప్రాచీన యోగాకు క్రీడల్లో 63వ స్థానం కల్పించడం హర్షనీయమని జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు పతాంజలి యోగా శిక్షకులు పుల్లేటి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం 2023లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లోనూ, 2024 గోవాలో జరిగిన జాతీయక్రీడల్లోనూ అవకాశం కల్పించి యోగాని 63వ క్రీడగా గుర్తించి ప్రతి సంవత్సరం యోగ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లోనూ, 2026లో జరగబోయే ఏషియన్ గేమ్స్‌లో కూడా యోగాకి అవకాశం కల్పించినట్లు, భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో కూడా యోగాని చూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యోగాలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిటి ఉష తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు కారుకుండి అప్పలరాజు, రమణలను నష్టాల వివరాలను అడిగారు. పక్కా గృహాలు నిర్మించుకోవాలని, తనవంతు ఆర్థిక సహాయం అందజేస్తానని ఆయన హామీ పలికారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కొయ్య శ్రీనివాస్, ఎం శ్రీవేణి, సీరా శ్రీనివాసరావు, కారుకుండి శ్రీను తదితరులున్నారు.

డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

డెంగీ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖాజీపాలెంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిసారా, మలేరియా, డెంగీ, చికున్ గునియా వ్యాధులపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ పుట్టకూడదు, దోమకుట్ట కూడదు అని, దోమతెరలు వాడాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. చిన్న పిల్లల్లో ఎక్కువ మరణాలు డయేరయా వల్లే వస్తున్నట్లు చెప్పారు. పరిసరాల అపరిశుభ్రత, కలుషిత ఆహారం, కలుషిత తాగునీటి వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. వ్యాధి లక్షణాలు సోకకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను పాటిస్తే 90 శాతం వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్, వైద్య సిబ్బంది శశి, లీల, నాగేశ్వరరావు, శిరీష, గణపతి, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మస్తర్లలో దిద్దుబాటు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 16వ విడత సామాజిక తనిఖీ మంగళవారం కె.కోటపాడులో నిర్వహించారు. మండలంలోని కె.కోటపాడు, దాలివలస, గవరపాలెం గ్రామాలలో కూలీల మస్తర్లలో దిద్దుబాట్లు జరిగినట్లు గుర్తించారు. ఇటువంటి పొరపాట్లు మరల జరిగితే సహించేది లేదని ప్రిసైడింగ్ అధికారి రోజారాణి సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామ పంచాయితీల పరిధిలో ఇజియస్ వేతన రూపంలో రూ.14,16,53,394, పంచాయతీరాజ్‌కి సంబంధించి మెటిరియల్ రూపంలో రూ.13,01,20,884, రిజర్వ్ ఫారెస్టుకి సంబంధించి రూ.8,96,155 ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ అధికారులు గత నెల 19 నుండి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాలలో తనిఖీ చేపట్టి గ్రామసభలు నిర్వహించారని ఏపీవో అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్‌మోహన్, ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, ఎంపిడిఒ బివివిపి.పట్నాయక్, మాడుగుల క్లస్టర్ ఎపిడి బి.శ్రీనివాస్, ఎపిఓ అప్పలరాజు, డిఆర్‌డిఎ (డిపియమ్) పెన్షన్స్ పి.వెంకటరమణ, ఇఒపిఆర్అండ్ ఆర్‌డి ప్రసాద్, పిఆర్ ఎఇ బాలాజీ అప్పారావు, సర్పంచ్‌లు, యంపిటిసిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సమస్యలపై గ్రామసభలో నిలదీత

ప్రజాశక్తి -అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామసభలో పలువురు పలు సమస్యలపై నిలదీశారు. గ్రామపంచాయతీ అధికారులు హాజరు కాకపోవడంపై గ్రామ ప్రజలు మండిపడ్డారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, గవరపేట వీధి శివాలయం నుంచి రామాలయం వరకు ఊర కాలువ వెంటనే పూర్తి చేయాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి పైప్ లైన్ వేసేటప్పుడు రోడ్లన్నీ తవ్వేసి పాడు చేశారని, తిరిగి వాటిని కాంట్రాక్టర్ బాగు చేయలేదని తెలిపారు. తుమ్మపాల వీధిలో డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన చేసి వదిలేశారని, దానిని పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ కర్రి బాబి, బిజెపి నాయకులు పీల మురళి కోరారు. రెడ్ మార్క్‌లో ఉన్న భూమి ఆన్లైన్లో అన్ని తీసివేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని పలువురు కోరారు. గ్రామ కంఠంలో ఉన్న భూములు ఎంత ఉన్నది లెక్క తీయాలని టిడిపి నాయకులు సందిన సునీల్ నిలదీశారు. మధురానగర్ హౌసింగ్ కాలనీ అధ్యక్షులు గోకవాడ శ్రీరాములు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, వీధి లైట్లు, రోడ్లు, తాగునీటిపై ఎక్కువ దష్టి పెట్టాలని కోరారు. గుండాల వీధిలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మించాలని, మెయిన్ రోడ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు కాండ్రేగుల రవి అన్నారు. గ్రామ సభలో వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, చదరం నాగేశ్వరరావు, న్యాయవాది పిళ్లా హర శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి బోసు బాబు, బొడ్డపాటి చినరాజారావు, కోన దుర్గేష్, కోన అప్పారావు, గొర్లి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి..

తుమ్మపాల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆశా కార్యకర్త అమ్మాజీ కుమారుడు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పీలా మురళి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలాగా, ఆ కుటుంబానికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం వచ్చేలాగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని గ్రామ సెక్రెటరీ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కి, మెడికల్ డిపార్ట్మెంట్, ఎమ్మెల్యే, ఎంపీ దృష్టి తీసుకెళ్లాలని కోరారు.



గ్రామసభలో నిలదీస్తున్న స్థానిక నాయకులు

గిరిజన గ్రామాల్లో జ్వరాలు

తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం



తాటిపూడిలో జ్వరంతో బాధపడుతున్న గిరిజనుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని గరిసింగి, వాలాబు, చింతలపూడి, తామరబ్బ, పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో విస్తృతంగా జ్వరాలు వ్యాప్తిస్తున్నాయని సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర పేర్కొన్నారు. గర్సింగి పంచాయతీలో జ్వరాలతో బాధపడుతున్న జ్వరపీడితులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్సింగి పంచాయతీ తాటిపూడి గ్రామంలో జన్ని గంగం దొర, జన్ని దేముడు, చింతలపాలెంలో జన్ని సామలమ్మ, పుట్టింగి సంతోష్, యాలం బైలు, మజ్జి హారిక, జన్ని దివ్య జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. మిగిలిన గిరిజన పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. మలేరియా జ్వరాలు వచ్చిన వారు ప్రభుత్వ హాస్పిటల్లో చూపించిన సరైన వైద్యం చేయటం లేదని గరిసింగి పంచాయతీ తాటిపూడి గ్రామస్తులు ఆవేదన చెందినట్లు ఆయన పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వ వైద్య అధికారులు స్పందించి గ్రామస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం సేవలు అందించాలని దొర డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అనకాపల్లి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్య, 12ఎంఎంకోర్టు మెజిస్ట్రేట్ బివి.విజయలక్ష్మి, 11 ఎఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ ఏ.రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి కోర్టు కాంప్లెక్స్ వద్ద ప్రారంభమైన ఆ ర్యాలీ రింగ్ రోడ్ మీదుగా, తిరిగి కోర్ట్ కాంప్లెక్స్ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన యాక్సిడెంట్ డేటా ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో 3703 కేసులలో 3042 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలలో చనిపోయారని తెలిపారు. కేవలం హెల్మెట్ దరించకపోవడం వలన ఇంతమంది పౌరులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రమాదాల తీవ్రత గుర్తించి ముఖ్యంగా యువత, విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళుతున్నప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించి, సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శంకర రావు, పట్టణ నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, పోలీసులు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం చెర్లోపాలెం గ్రామంలో పాడి రైతులకు డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు చేతుల మీదుగా 35 మంది రైతులకు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రమాద బీమా పశు బీమా, కృత్రిమ గర్భధారణ, వ్యాక్సిన్ తదితర వాటిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు నూకరాజు, కళ్యాణం, వరలక్ష్మి, అప్పలనాయుడు, ఇతర రైతులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కౌన్సెలింగ్


ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం సీట్లుకు అడ్మిషన్ కౌన్సెలింగ్ బుధవారం జరుగుతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కొరకు దరఖాస్తు సమర్పించే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో ఉదయం 9.30 గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలని కోరారు. కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ తదితర నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయని, ఒక్కో దాంట్లో 30 సీట్లు చొప్పున ఉన్నాయని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ హెడ్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నియమించినట్లు చెప్పారు. ఆసక్తి గలవారు 9063297220, 08924 220377, 9505504220 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పాడి రైతులకు రాయితీపై జొన్న విత్తనాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పాడి రైతులకు రాయితీపై జొన్న విత్తనాలు అందిస్తున్నట్లు సబ్బవరం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శారదా కుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పశు గ్రాస జొన్న విత్తనాలు ఐదు కేజీల ప్యాకెట్టు 460 రూపాయలు కాగా 75శాతం రాయితీపై 115 రూపాయలకే రైతులు పొందవచ్చునని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు తెలిపి రైతు సేవా కేంద్రాల్లోనూ, పశువైద్య కేంద్రాల్లోనూ పొందవచ్చని పేర్కొన్నారు.

ప్రతి నెలా 9న గర్భిణులకు ఉచిత స్కానింగ్

ప్రజాశక్తి- కశింకోట : ప్రతి నెలా 9వ తేదీన తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎంవిఎస్‌కె.బాలాజీ అన్నారు. మండలంలోని తాళ్ళపాలెం పిహెచ్‌సిలో నూతన స్కానింగ్ మిషన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ తాళ్లపాలెం పిహెచ్‌సి పరిధిలో చాలా మంది స్కానింగ్ లేక పట్టణ ప్రాంతానికి వెళ్లి ఇబ్బంది పడుతున్నారని, దీంతో ఇక్కడ స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం 56 మందికి ఉచిత స్కానింగ్ చేశారు, ఈ స్కానింగ్ యలమంచిలి వైద్య అధికారి మౌనిక చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్, ఆరోగ్య బోధకుడు ఎం.ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎవి.సుబ్బారావు, పర్యవేక్షకులు ఎస్.నర్సిగరావు, ఆర్.సత్య నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

ఆసుపత్రుల్లో రోగుల బంధువుల దాడిపై..

స్టాఫ్ నర్సుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులకు భద్రత కల్పించాలంటూ ఆంధ్రప్రదేశ్ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్టాఫ్ నర్సులు ప్రశాంతి, నాగమణిల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్స్‌లకు ఎటువంటి భద్రత లేదని, ఇటీవల దాడులు పెరిగాయన్నారు. తిరుపతి రూయా ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న స్టాఫ్‌పై రోగి ఆకస్మికంగా సెలైన్ బాటిల్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలన్నారు. విశాఖపట్నం కెజిహెచ్లో రోగి బంధువులు అలజడి సృష్టించి స్టాఫ్ నర్స్ పై భౌతిక దాడులు చేశారన్నారు. విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సలపై దాడులతో రోగులకు వైద్యం చేయాలంటే భయమేస్తోందని, ఎప్పుడు ఏ సంఘటన జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టాఫ్ నర్సలపై దాడులు నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న మాజీ జెడ్‌పిటిసి

ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుదీష్ణను మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ కోరారు. ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు పనులను మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి అధికారులతో మాట్లాడుతూ, వెంటనే ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసి తాగు నీరు అందేలా చూడాలన్నారు. లింగంపేట భారీ నీటి పథకం నుంచి కేడీపేట వచ్చే తాగునీరు పైపులైను పలుమార్లు మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు.సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించి పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వం నమోదు చేస్తున్న యూనియన్ నాయకులు

ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఏపీటీఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘ నేతలు ఆధ్వర్యంలో మంగళవారం చురుగ్గా నిర్వహించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి సభ్యత్వాలు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు (వేణు) మాట్లాడుతూ, జీవో 117ను, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే అమ్మకు వందనం వర్తింపజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి. శ్రీనివాసరావు, పూర్వ గౌరవ అధ్యక్షులు బి.సింహాచలం, నక్కపల్లి బాధ్యులు వై.కృష్ణ, సిహెచ్ అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు అయ్యన్నపాలెంలో మంగళవారం నూకతాత ఆటో యూనియన్ ఓనర్ కం డ్రైవర్లు ఆధ్వర్యంలో ఘనంగా తలుపులమ్మ తల్లి పండుగను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు .ఆటో యూనియన్ నాయకులు, ఓనర్లు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చెట్టుపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి పంచాయతీలో డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించారు. ఈ విషయమై సోమవారం రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం డిఎల్‌పిఓ చెట్టుపల్లి గ్రామాన్ని సందర్శించారు. తక్షణమే చెత్తను తొలగించాలని ఆదేశించడంతో హుటాహుటిన ఈ సమస్య పరిష్కారమైంది. ఈ మేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని సుంకరమెట్ట పంచాయతీలో పరిధి ఎనిమిది ఎలిమెం టరీ స్కూల్లో సుమారు 340 మంది విద్యార్థిని విద్యార్థులకు దాతల సహకారంతో నోట్ బుక్స్ లు మంగళవారం సర్పంచ్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పాఠశాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని తెలిపారు. తల్లిదండ్రులకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతు న్నారన్నారు .జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నానిబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

ప్రజాశక్తి -గొలుగొండ: నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందించినట్లయితే అధిక పాల దిగుబడి సాధించ వచ్చని గొలుగొండ, కేడీపేట పశు వైద్యాధికారులు రమేష్ , శిరీషలు తెలిపారు. ఈనెల ఏడవ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఇరువురు వైద్యులు మంగళవారం ఏఎల్ పురం, గొలుగొండ పశుగ్రాసాల సాగు భూములను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాణ్యమైన పశుగ్రాసాలతో పశువులకు అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. దీంతో పశువులు ఆరోగ్యంగా ఉంటూ అధిక పాల దిగుబడిని ఇస్తాయని తెలిపారు. రైతుల కోసం పశు గ్రాస విత్తనాలు 75 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.పశువులకు ఆరోగ్యరీత్యా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్లని, వైద్యాధికారులును సంప్రదించాలని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు



చికిత్స చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త ఎల్లవరం పంచాయతీ శివారు దొంకాడ, పప్పుశెట్టిపాలెం పంచాయతీ సుద్దలపాలెం, అడ్డలోవ గిరిజన గ్రామాల్లో గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారులు కీర్తి, ధనుంజయ ల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అవసరమైన వారి నుండి రక్త పూతలను సేకరించారు. డెంగ్యూ, డయేరియా లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం



కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక విధానం ద్వారా నక్కపల్లిలో ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం కొనుగోలు ప్రారంభం అయ్యింది.పలువురు ఇసుకను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లారు .టన్ను ఇసుక ధర రూ.1225లుగా నిర్ణయించడంతో కొనుగోలు దారులు పెద్దగా ఆసక్తి కనబరచ లేదు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశాల మేరకు ర్యాంపు వద్ద షిఫ్ట్‌ల వారీగా ఉద్యోగులు నియమించి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో చాలా గ్రామాలకు తాగునీరు, రహదారుల సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చడమే తన తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

11న పాలిసెట్ ఫైనల్ సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 11న పాలిటెక్నిక్ ప్రవేశాలకు పాలీసెట్ 2024 ఫైనల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ జరగనుందని నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.రామచంద్రరావు తెలిపారు. ఈ వెరిఫికేషన్ విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరగనుందని చెప్పారు. 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మొదటి ర్యాంకు నుండి చివరి ర్యాంక్ వరకు వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. 11 నుండి 14 వరకు ఆప్షన్ ఎంట్రీ, వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హాస్టల్ భవనాన్ని వినియోగించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపిటిసి సుర్ల రామకృష్ణ కోరారు. గతంలో జిల్లా పరిషత్ పాఠశాలను ఆనుకొని ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ హాస్టల్లో బాలుర సంఖ్య తగ్గి పోవడంతో ప్రభుత్వం హాస్టల్లను రద్దు చేయడం జరిగిందని, దీంతో ఆ భవనం గత ఐదారు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందన్నారు. దీంతో తుప్పలతో దర్శనమిస్తుందని చెప్పారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

తహాశీల్దార్‌కు దళితుల వినతి

ప్రజాశక్తి గొలుగొండ : గ్రామంలో కొంతమందికి పట్టాలు రాలేదని, పట్టాలు వచ్చిన వారిపై కక్ష కట్టి బతుకుల పాడు చేయడం తగదని, తమకు డి పట్టాలు పొందే అర్హత ఉందంటూ లబ్దిదారులంతా మంగళవారం స్థానిక తహసిల్దార్ ప్రభాకర్ రాజుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. సర్వే నెంబరు 75 లో క్వారీకి అనుకొని ఉన్న భూమిలో గత ఎన్నో ఏళ్ల నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూములకే గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరు చేశారన్నారు. తమకు పట్టాలు ఇచ్చిన భూమి పక్కనే జీరాయితీ భూమిలో రంగురాళ్ల క్వారీ ఉండడంతో ఆ భూమి లో కూడా రంగురాళ్లు ఉంటాయనే ఉద్దేశంతో టిడిపికి చెందిన కొంతమంది తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. వారి స్వార్థానికి మమ్మల్ని బలి చేయకండి అంటూ తహసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చామని లబ్దిదారులు తెలిపారు.

ఘనంగా కనకమహాలక్ష్మి కో - ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కనక మహాలక్ష్మి కో - ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ రజతోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ బాగుపడాలంటే రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదని, ఎన్నికలు సక్రమంగా జరగాలని అన్నారు. నాయకుల విధానంలో మార్పు రావాలని తెలిపారు. అన్నీ ఫ్రీ అంటే సాధ్యం కాదని, ప్రజలు అప్పు తీసుకుంటే ఆ అప్పు కట్టాలి అనే దృక్పథం కల్పించాలని అన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని, ఉచిత పథకాల వల్ల దేశానికి నష్టం జరుగుతోందని అన్నారు. రాజకీయ నాయకులు ప్రజల ఆస్తులు తాకట్టు పెడుతున్నారన్నీరు. సహకార వ్యవస్థ విస్తరించాలని, పేదవర్గాలకు చేయూతనివ్వాలని ఆకాంక్షించారు. ఎన్‌పిఎ విధానం మంచిది కాదని అన్నారు. కనక మహాలక్ష్మీ కో - ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ 1999లో ఏడుగురు సిబ్బంది, రూ.31 కోట్ల షేర్, రూ.100 కోట్లు రిజర్వ్‌తో సంస్థ ప్రారంభించామని అది నేడు 900 కోట్లు డిపాజిట్లు, 600 కోట్లు రిజర్వ్, 29 బ్రాంచ్‌లు. 1476 కోట్లు టోటల్ వ్యాపారంగా వృద్ధి చెందిందని తెలిపారు. కరోనా సమయంలో తప్ప ప్రతి



బ్యాంకు రజతోత్సవ ప్రత్యేక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

ఏడాదీ 10-20 శాతం డివిడెండ్ అందించామని, రిజర్వ్ బ్యాంక్ నియమాలకు అనుగుణం గా సంస్థను నిర్వహిస్తున్నామని చెప్పారు. 2011లో సొంత భవనం నిర్మించుకున్న తాము ప్రస్తుతం ఏలూరు, విజయవాడ, పాలకొల్లు, విశాఖపట్నంలలో సొంత భవనాలు కలిగి ఉన్నామన్నారు. త్వరలోనే ఎంవిపి.కాలనీలో మరో భవనం నిర్మిస్తున్నామని అన్నారు. తమ బ్యాంకులో అన్ని రకాల ఆర్థిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, హిందుస్థాన్ షిప్ యార్డ్ కో - ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, తెలంగాణ స్టేట్ కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ ఫెడరేషన్ చైర్మన్ జి.మదన్ గోపాల్ స్వామి, మహారాజా కో - ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌కె.రాజు, జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ టి.ప్రవీణ, కాకినాడ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు.



విజయ స్వాతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.జగన్నాధపురం గ్రామం విద్యార్థిని గంగిరెడ్డి విజయ స్వాతి ఎన్ఎం ఎంఎస్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటింది. ఈ సందర్భంగా హైస్కూల్లో మంగళవారం హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు విజయ స్వాతిని సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అప్పారావు మాట్లాడుతూ, విజయ స్వాతి విద్యలో మెరుగైన ప్రతిభ కనబరచడంతో ఉపాధ్యాయులు ఎన్.ఎంఎంఎస్ 2023 పరీక్షకు సన్నద్ధం చేశారన్నారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిందన్నారు. స్కాలర్ షిప్ ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తన విజయానికి కృషి చేసిన హెచ్ఎంతో పాటు ఉపాధ్యా యులకు విజయ స్వాతి కృతజ్ఞతలు తెలియ జేసింది.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రతి ఏటా ఇస్తున్న విధంగానే, ఈ ఏడాది కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు కేంద్ర గౌరీ సంఘం విశాఖ అధ్యక్షులు బుద్ధ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ 80 శాతం పైగా మార్కులు సాధించిన వారికి, పాలిటెక్నిక్, ఎంసెట్, ఐఐటి, గేట్, ఐసెట్, ఈసెట్, ఆసెట్, లాసెట్, ఎపిఆర్ జెసి, పిజీసెట్ లలో ర్యాంకులు సాధించిన వారికి ఈ నెల 28న నగదు బహుమతి, జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లు కూడా అందజేస్తామన్నారు. తాటిచెట్లపాలెం లోని ఆశీర్వాద్ కల్యాణ మండపం (రైల్వే)లో ఈ కార్యక్రమం ఉంటుందని, ఈ నెల 15 లోపు అభ్యర్థులు తమ వివరాలు అంద జేయాలని కోరారు. అదే విధంగా ఆధారం లేని గవరకు చెందిన మెరిట్ విద్యార్థులకు 10 మంది వరకు రూ.10 వేల చొప్పున ఉపకార వేతనాల్ని అందజేస్తామన్నారు. ఇంటర్ పాసైన పేద విద్యార్థులకు డిగ్రీ ఉచితంగా చదివిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కోశాధికారి కొణతాల వరహా కోటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావుతో పాటు సంఘం కార్యాలయంలోనూ సంప్రదించొచ్చన్నారు.

ఎల్ఐసి ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ కేశవరావు మెమోరియల్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఓపెన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన ఎల్ఐసి ఉద్యోగులు డివిఎస్‌వై.శర్మ, ఎస్.పద్మలను మంగళవారం ఉదయం ఎల్ఐసి విశాఖపట్నం ప్రధాన కార్యాలయంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ (పర్సనల్) డి.రామారావులు ఘనంగా సత్కరించారు. అనంతరం శారద ప్రసాద్ దాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీలలో గెలిచి సంస్థ ప్రతిష్టను నిలబెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి బి.శ్రీనివాస్, ఎల్ఐసి స్పోర్ట్స్ డెస్క్ అధికారి శంకర్ నారాయణ పాల్గొన్నారు.

నేడు గిరిజన శాఖ మంత్రి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ నెల పదవ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఆమె పదవ తేదీ బుధవారం ఉదయం 6.30 గంటలకు సాలురులో బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 11గంటలకు పాడేరు చేరుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు పాడేరు ఐటిడిఎ గెస్ట్ హౌస్‌లో టిడిపి నాయకులతో సమావేశమవుతారు. సాయంత్రం. 4 గంటలకు విశాఖకు వెళతారు.

వాసుపల్లి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె నాయుడు డిమాండ్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వైసిపి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ రామబాణం విద్యా సంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేల రూపాయలకు పుస్తకాలు, యూనిఫాం వ్యాపారం చేయడాన్ని, సర్టిఫికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులు వద్ద నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాలేజీ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె. నాయుడు మాట్లాడుతూ, వైసిపి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ గత ప్రభుత్వంలో తన అధికారాన్ని ఉపయోగించి రామబాణం పేరుతో అక్రమంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారని, వీటిలో చాలా వరకు గుర్తింపు కూడా లేకుండా అధికారులను భయ పెట్టి కాలేజీలను నడుపుతున్నారని తెలిపారు. డిఫెన్స్ అకాడమి నిర్వహణ పేరుతో విద్యార్థుల వద్ద నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ వారికి కనీసం మౌళిక సదుపాయాలు కూడా కల్పించ లేదన్నారు. కాలేజీకి ప్లే గ్రౌండ్ కూడా లేకుండా బిఆర్ టిఎస్ రోడ్డు మీదనే డ్రిల్, రన్నింగ్ చేయిస్తున్నారని, రాజకీయ కార్యకలాపాలు, ఇతర వ్యాపారాలు నడుస్తున్న కాంప్లెక్స్ లోనే కాలేజీలు నడుపున్నారాన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాలేజీలలో వేల రూపాయలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు చేస్తున్నారని, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా స్పందించ లేదన్నారు. విద్యార్థుల చదువు పూర్తయిన తరువాత సర్టిఫికెట్స్ ఇచ్చేందుకు అదనంగా ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి ఈ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి స్పందించి పుస్తకాలు, యూనిఫాం ఉన్న గదులను సీజ్ చేశారు. .దీంతో ధర్నాని విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.అజయ్, సహాయ కార్యదర్శి పి.సాయితేజ, నాయకులు ఎం.గుణ, సాయి,ఎం.అజయ్,అఖిల్, నిఖిల్, కాలేజీ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తాగునీటి సమస్యపై ఐద్వా ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31వ వార్డులో మంచి నీటి సమస్యలను పరిష్కారం చేయాలని ఐద్వా జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జోన్ నాయకులు ఎం.అన్నపూర్ణ మాట్లాడుతూ జనవరి నుండి మంచినీరు కలుషితమై పురుగులు, దుర్వాసనతో వస్తోందని తెలిపారు. దీనిని అరికట్టి పరిశుభ్రమైన మంచి నీరు ఇవ్వాలని సంబంధింత అధికారులను అనేకసార్లు కలసి విన్నవించుకున్నా ఫలితం కానరాలేదన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల 31వ వార్డులోని ప్రజలు డయేరియా, టైఫాయిడ్, మలేరియా లాంటి జర్వాల భారిన పడుతున్నారన్నారు. ఆసుపత్రుల పాలై వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ప్రజలను పట్టించుకోవడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. ఇప్పటికైనా జివియంసి కమిషనర్ స్పందించి తమ ప్రాంతంలో కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీరును అరికట్టి, దుర్వాసన లేకుండా పరిశుభ్రమైన నీరు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పద్మ, అరుణ, దేవి, భారతి, కాంతం, చిన్ని, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కలుషిత నీటిని బాటిళ్లలో నింపి నిరసన చేపడుతున్న ఐద్వా నేతలు

పోలీసులకు కెజిహెచ్‌లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పోలీస్ శాఖలో పని చేసున్న పోలీస్‌లు, ఆఫీస్ సిబ్బందికి వైద్య పరీక్షల ప్రత్యేక శిభిరంను కెజిహెచ్‌లో ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు చేయాలని నగర పోలీస్ కమిషనర్ కెజిహెచ్ సూపరింటిండెంట్‌ను కోరారు. ఈ మేరకు సూపరింటెండెంట్ పి.శివానంద స్పందించి పోలీస్ సిబ్బందికి కెజిహెచ్ బ్లడ్ బ్యాంకు వద్ద వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. రెండు వారాల పాటు కొనసాగే ఈ శిబిరాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ, వయస్సు పైబడిన వారిలో గుండె జబ్బులు, రక్త పోటు, డయాబిటీస్ సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.వైద్య పరీక్షలు చేయించుకొని జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ కెవివి సుబ్రహ్మణ్యం, ఎఆర్ఎంఓ డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.